

గ్రామాల్లో సౌర వెలుగులు

ఉమ్మడి జిల్లాలోని రెండు గ్రామాలను పీఎం సూర్యఘర్ మఫ్త్ బిజిలీ యోజన కింద కేంద్రం ఎంపిక చేసింది. మోడల్ గ్రామాలుగా ఎంపిక చేయగా.. సర్వే పూర్తయింది. 10లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:25	ఆది : 4:56

గరిష్టం/కనిష్టం
39.0 /24.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎండిన పొలాల పరిశీలన



ఎండిన పొలంలో రైతుతో ఏవో సుధాకర్

సాక్షి ఎఫెక్ట్..

భీమారం: 'నెర్రెలు బారిన పొలం' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. నీళ్లు లేక ఎండిపోతున్న వరి పంట పొలాలను ఏవో అత్తె సుధాకర్, ఏఈవో బొల్లంపల్లి అరుణ్‌కుమార్ పరిశీలించారు. గొల్లవాగు ప్రాజెక్టుకు సమీపంలోనే ఉన్నా నీళ్లు అందని దుస్థితి నెలకొందని రైతులు వివరించారు. ఎండిపోయిన పంటల వివరాల నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామని అధికారులు తెలిపారు.

'పది' పరీక్షలకు 99.75శాతం హాజరు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన భౌతిక రసాయన శాస్త్రం పరీక్షకు 99.75శాతం విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 9,198 మందికి గాను 9,175 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారు. గతంలో ఫెయిలైన వారు 134 మందికి గాను 118 మంది హాజరు కాగా 16 మంది రాలేదు. మూడు పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి, డీఈవో యాదయ్య, 13 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్‌స్క్వాడ్ పరిశీలించారని అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దామోదర్‌రావు తెలిపారు.

జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్



బండవరం జగన్

మంచిర్యాలక్రైం: జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బండవరం జగ్గయ్య అలియాస్ జగన్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఎన్నికల కమిషనర్ అనిల్‌రాజ్ ఆధ్వర్యంలో పోలింగ్ నిర్వహించారు. 312మందికి గాను 287మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సత్తయ్యపై జగన్ 22ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా భుజంగ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఆవునూరి సతీష్, కోశాధికారిగా చకినారపు దత్తాత్రేయ, లైబ్రరీ సెక్రెటరీగా వడ్లకొండ రంజిత్‌కుమార్‌గౌడ్, మహిళా ప్రతినిధిగా బోగే ఉమరాణి, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా రంగు వేణుకుమార్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీప్రసన్న, సందెల మల్లేష్, కొట్టూరి సింధూజ, సోమ ప్రదీప్‌చంద్ర, పెసర శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

'మంత్రి 'జూపల్లి' వ్యాఖ్యలు సరికావు'



మాట్లాడుతున్న శ్యాంకుమార్ యాదవ్

నస్పూర్: యాదవుల అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా మంత్రి జూపల్లి కృష్ణారావు శాసన మండలిలో వ్యాఖ్యలు చేయడం సరికాదని యాదవ ఒగ్గు పూజారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజనమేన శ్యాంకుమార్‌యాదవ్ అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన సంఘం నాయకులతో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్య క్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయంతోపాటు శ్రీశైలం, వేలాల, గొల్లగట్టు జాతరలో పూజారులుగా యాదవులే ఉన్నారని పేర్కొన్నారు. మంత్రిని ఎవరో తప్పుదోవ పట్టించారని, ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు చింతల రాయమల్లు, ఏ.మల్లేష్, పరిస ఐలయ్య, ఎగ్గె రమేశ్, బాసవేన భానేష్, అంగ మల్లేష్, పున్నం పోషన్న పాల్గొన్నారు.

అక్రమ దందాకు చెక్!



కొల్లూరు క్వారీలో లారీలోని ఇసుకను తూకం సరి చేస్తున్న సిబ్బంది

- ఇసుక అక్రమ రవాణాపై దృష్టి
- నిరంతరం కలెక్టర్, అధికారుల పర్యవేక్షణ
- ఇదే తీరుగా ఉంటే అక్రమాలకు అడ్డుకట్ట

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. రాష్ట్రస్థాయి నుంచి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలనే ఆదేశాలు రావడంతో ఆ మేరకు జిల్లాలోని క్వారీలపై నిరంతరం నిఘా కొనసాగుతోంది. టీజీఎండీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో దావరి ఇసుక అమ్మకాల్లో అవకతవకల నివారణకు ఇప్పటికే జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు క్వారీల వద్దకు వెళ్లి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. క్వారీల్లో ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌తోపాటు ఉన్నతాధికారులు సైతం పలుమార్లు ఆకస్మిక తనిఖీలు చేయడం, అధికారులకు కలెక్టర్ హెచ్చరికలు జారీ చేయడంతో అక్రమ దందా నిలిచిపోయింది. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతోపాటు కార్పొరేషన్, మైనింగ్, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. బుకింగ్ చేసుకున్న వారికే బరువు సరి చేస్తున్నారు. అధికంగా తీసుకునేందుకు అనుమతి ఇవ్వడం లేదు. ప్రస్తుతం జిల్లాలో కోటపల్లి మండలం కొల్లూరు, పలుగుల ఎర్రాయిపేట పరిధిలో ఇసుక అమ్మకాలు సాగుతున్నాయి. శుక్రవారం రెండు స్టాక్ యార్డుల నుంచి 155ఆర్డర్లు రాగా, 4,940క్యూబిక్ మీటర్ల ఇసుక అమ్మకాలు జరిగాయి.

ఆగినట్లేనా?

ఇసుక రవాణాపై కలెక్టర్ కుమార్ దీపక్ నిత్యం అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇసుక అక్రమంగా రవాణా జరుగుతోందని ఓ యువకుడు వీడియో తీయగా, వెంటనే అధికారులు అప్రమత్తమై తనిఖీలు నిర్వహించారు. స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులతో తనిఖీలు చేశారు. గతంలో నిర్ధేశిత ఇసుక కన్నా అదనంగా బకెట్‌తో లారీల్లో వేస్తూ అదనంగా సొమ్ము చేసుకునే వారు. రోజువారీగా నిత్యం వందల లారీలు వస్తుండేవి. అంతేగాక రాత్రివేళ ఎలాంటి తనిఖీలు లేకుండా ఇసుక జిల్లా దాటేది. చెక్‌పోస్టులు, పోలీసుస్టేషన్ల నుంచి అడ్డు చెప్పకపోవడంతో దందా నడిచింది. జైపూర్, చెన్నూరు, కోటపల్లి మండలాల పరిధిలో రాజకీయ పలుకుబడి, ప్రజాప్రతినిధులు, అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్లు ముట్టడంతో అంతా సైలెంట్‌గా వ్యవహారం నడిచేది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో ప్రస్తుతం రోజుకు వందకు పైగానే ఇసుక బుకింగ్ జరుగుతున్నాయి. గతంలో మాదిరి అక్రమాలు చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కొందరు ఇసుక దందాకు అడ్డు చెప్పకుండా ఓ ప్రజాప్రతినిధితో చెప్పించేందుకు ప్రయత్నాలు జరిగాయి. స్థానికులకు గోదావరి నుంచి ఇసుక తీసునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

అక్రమాలు లేకుండా సరఫరా

- ప్రయాణికులకు ఇబ్బందులు కలుగొద్దు
- కలెక్టర్ కుమార్ దీపక్
- ఇసుక క్వారీల్లో తనిఖీ



క్వారీలో అధికారులతో కలెక్టర్, డీసీపీ

కోటపల్లి: ఇసుక రవాణాలో అక్రమాలు, లోటుపాట్లు లేకుండా సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని కొల్లూర్, ఎర్రాయిపేట ఇసుక క్వారీలను డీసీపీ భాస్కర్‌తో కలిసి తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక క్వారీలకు వచ్చే లారీల వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇసుక లోడింగ్ ఆలస్యం కారణంగా జాతీయ రహదారిపై లారీలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, లోడింగ్‌లో వేగం పెంచాలని, ఇసుక క్వారీల సామర్థ్యం త్వరలో పెంచుతామని తెలిపారు. రోజుకు 200వరకు లారీలు లోడింగ్ అయ్యేలా చూడాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కోటపల్లి తహసీల్దార్ కార్యాలయం, ఎస్సీ హాస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు, డాక్టర్ అరుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చెన్నూర్: ప్రభుత్వ పాఠశాలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం చెన్నూర్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, మండలంలోని పొక్కూర్, చెల్లాయిపేట, సుందరశాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పథకంలో నిర్మిస్తున్న గదులు, భోజనశాల, వంట గదులు పరిశీలించారు. తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్, కస్తూర్బా పాఠశాల ప్రతేకాధికారి సుమలత పాల్గొన్నారు.

రెండు నెలల్లో కేసులు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య, వేదికపై కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్

- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఎందుకు..?
- ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కృషి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య

మంచిర్యాలఅగ్రికల్చర్: భూ సమస్యలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు రెండు నెలల్లోగా పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, సభ్యులతో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి, భూ సంబంధిత కేసులు, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యలు, సంక్షేమ ఫలాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి అట్రాసిటి కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని, ఎందుకు పరిష్కరించడం లేదని డీసీపీ భాస్కర్‌ను ప్రశ్నించారు. మే 30లోపు అట్రాసిటి కేసులు, భూ సంబంధిత కేసులన్నీ ఏప్రిల్ 30లోపు పరిష్కరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కోసం ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల దరఖాస్తులను కనీసం 15రోజులు, గరిష్టంగా 31రోజుల్లోపు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య ఎస్సీ, ఎస్టీ కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ అట్రాసిటి కేసుల్లో 60 నుంచి 70శాతం మాత్రమే నిజమైనవి ఉంటున్నాయని తెలిపారు. 2024లో 86 కేసులు కాగా ఇందులో 56 కేసులు కోర్టుకు పంపించామని, 2025లో 21 కేసులు నమోదు కాగా ఒక కేసు చార్జీషీట్ చేశామని, మిగతావి పరిశీలనలో ఉన్నాయని, కొన్ని కోర్టు స్టేలో కొనసాగుతున్నాయని వివరించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రేణుగుంట్ల ప్రవీణ్, కుస్రం నీలాదేవి, రాంబాబునాయక్, కే.లక్ష్మీనారాయణ, జిల్ల శంకర్, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, సింగరేణి కంపెనీ జీఎంలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నిల్వ నీడ లేకుండా చేసింద్రు..



దివ్యాంగులమని కూడా చూడకుండా 30 గజాల్లో నిర్మించుకున్న ఇంటిని కూలగొట్టి అక్రమ కేసులు పెడుతూ పోలీసులు వేధిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో దివ్యాంగులకు స్థలం కేటాయించారు. 90 గజాల స్థలంలో ఉంది. గత కొన్ని సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నాం. కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పోలీసు వేధింపులు ఆగడం లేదు. మాకు న్యాయం చేయాలి.

– దివ్యాంగులు మల్లేష్, సుజాత,

తహసీల్దార్ పట్టించుకోవడం లేదు..

భూ సమస్యలు పరిష్కరించాలని కొన్నేళ్ల నుంచి తిరుగుతున్నాం. కన్నెపల్లి మండల తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దళితులమైనందుకే ఇలా వ్యవహరిస్తున్నాడు. ఉన్నతవర్గాలకు పెద్దపీట వేస్తున్నాడు.

– గుడెసెల రాజయ్య, దుర్గయ్య, ఎల్లయ్య, కన్నెపల్లి మండల రైతులు

అక్రమ పట్టాలు రద్దు చేయాలి..



కాసిపేట మండలం కోమటిచేను, గురువపూర్‌లోని జంగు సిపాయి భూములను కొందరు బినామీ పట్టాలతో ఆక్రమించుకున్నారు. 70 ఏళ్లుగా ఆదివాసీలం సాగు చేసుకుంటున్నాం. చెరువుల్లో మునిగిన కూడా అక్రమ పట్టాలు చేశారు. మందమర్రి మండలం తిమ్మపూర్‌లోనూ అక్రమ మార్గంలో కబ్జా చేస్తున్నారు. వీటిపైన విచారణ చేసి ఓఆర్సీ ఇవ్వాలని పలుమార్లు ఆర్డీవో, కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కమిషన్ దృష్టి సారించి తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– కుర్సింగే వెంకటేష్, ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

విద్య, ఉపాధి కేంద్రంగా హాజీపూర్



కేంద్రియ విద్యాలయం నూతన భవనం



గఢ్‌పూర్‌లోని జంగల్ సఫారీలో వెదురు మంచె

- పర్యాటక కేంద్రంగానూ గుర్తింపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం విద్యాకేంద్రంగానే కాకుండా ఐటీ పార్కు, ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుతోంది. పర్యాటకంగానూ ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యతోపాటు గురుకుల, కస్తూరిభా పాఠశాలలతోపాటు ఇప్పుడు కేంద్రియ విద్యాలయం, వైద్య కళాశాలకు హాజీపూర్ మండలం వేదికగా మారింది. కేంద్రియ విద్యాలయం నూతన భవన నిర్మాణం పూర్తి కాగా ప్రారంభానికి సిద్ధమైంది. ప్రభుత్వ వైద్య కళాశాల భవనం, హాస్టల్ భవన నిర్మాణాల పనులు చకచకా సాగుతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరంలోగా గుడిపేటలోనే కేంద్రియ విద్యాలయం, వైద్య కళాశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. త్వరలోనే యువత భవిష్యత్ భరోసా కోసం హాజీపూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు జరుగుతోంది. ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు పొందిన గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో వివిధ ప్రాంతాల యువత కానిస్టేబుల్, ఎస్సైలుగా శిక్షణ పొందుతూ ఉద్యోగాల్లో చేరుతున్నారు. వేంపల్లి, ముల్కల్ల శివారులోని 300 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కు ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. పరిశ్రమల శాఖ నుంచి ఉన్నతాధికారులు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించగా.. జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, రెవెన్యూ అధికారులు నివేదిక అందజేశారు. వేంపల్లి శివారులోని 159 సర్వే నంబర్‌లో ఉన్న దాదాపు 180 ఎకరాల స్థలాన్ని ఇందుకు సిద్ధం చేశారు.

పర్యాటక కేంద్రంగా..

హాజీపూర్ మండలం పర్యాటక కేంద్రంగానూ గుర్తింపు పొందుతోంది. మండలంలో ఎంసీసీ క్వారీ గుట్టలు దుర్గాదేవి జాతరతోపాటు పిక్నిక్, ఇతర కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోంది. ర్యాలీ గిరిజన గ్రామ శివారు అటవీ ప్రాంతంలోని జలపాతానికి ప్రత్యేకత ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు దిగువన 30 ఎకరాల్లో బొమ్మె చేపల పెంపకం చేపడుతున్నారు. ముల్కల్లలో ర్యాలీవాగు ప్రాజెక్ట్ కనువిందు చేస్తుండగా.. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. 62 గేట్లతో ఏకంగా 20టీఎంసీలకు పైగా నీటి సామర్థ్యంతో వర్షాకాలం భారీ వరదల సమయంలో గేట్లు తెరిచినప్పుడు దృశ్యాలు కనువిందు చేస్తాయి. ప్రాజెక్ట్‌లో బోటింగ్ సదుపాయం కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

జంగల్ సఫారీ..

గఢ్‌పూర్ గ్రామ శివారులోని ఎంసీసీ క్వారీలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గాంధారీ ఖిల్లా సఫారీ 25 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. అడవి అందాలు, వన్యప్రాణుల సందర్శన పర్యాటకులను మరింత కనువిందు చేస్తున్నాయి.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

- డీసీపీ ఎగ్గడి భాస్కర్
- అర్ధరాత్రి పెట్రోలింగ్



బ్యాగులు తనిఖీ చేస్తున్న డీసీపీ

మంచిర్యాలక్రైం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం రాత్రి ముస్లింలు షబ్ ఏ ఖద్ర్ జుగ్‌నేకి రాత్ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీసీపీ పోలీసు సిబ్బందితో కలిసి అర్ధరాత్రి నుంచి ఉదయం నాలుగు గంటల వరకు పెట్రోలింగ్ నిర్వహించారు. మజీద్‌లు, ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, బెల్లంపల్లి చౌరస్తా, ఐబీ చౌరస్తా ప్రధాన కూడళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించి వివరాలు, ఆధార్, వేలిముద్రలు సేకరించారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం సందర్శన

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని డీసీపీ భాస్కర్ శుక్రవారం సందర్శించారు. అధికారులతో మాట్లాడి పరీక్షల తీరుపై తెలుసుకున్నారు.

ఉపాధి లక్ష్యంగా ఏటీసీ



భవనం లోపల అమర్చిన యంత్రాలు



ఫ్లెక్సిబుల్ మ్యానుఫ్యాక్చరింగ్ సిస్టమ్

- అధునాతన, సాంకేతికతపై శిక్షణ
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలు
- ఆరు కోర్సుల్లో 172 సీట్లు

మంచిర్యాలఅర్బన్: నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక సంస్థ(ఐటీఐ)లను నవీకరించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలు(ఏటీసీ) సర్వం సిద్ధమవుతున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అధునాతన, సాంకేతికతపై శిక్షణకు ఆయా కేంద్రాల్లో వచ్చే విద్యాసంవత్సరం(జూన్ 2025) నుంచి తరగతుల ప్రారంభానికి చర్యలు వేగవంతమయ్యాయి. డిమాండ్ ఉన్న కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం, శిక్షణ పూర్తయిన వారికి స్వయం ఉపాధి కల్పించేలా పని చేస్తాయి. గత ఏడాది రూ.4.76 కోట్లతో మంచిర్యాల ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్మాణ పనులు చేపట్టగా పూర్తయ్యాయి. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా టాటా టెక్నాలజీ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఆరు కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఏడాది, రెండేళ్ల కోర్సులకు సంబంధించి 172సీట్లు భర్తీ చేస్తారు. ఇప్పటికే ఏటీసీలకు 70శాతం ప్రయోగ పరికరాలు(యంత్రాలు) చేరగా బిగించారు. కోర్సులకు సంబంధించి ఏటీసీ భవనంలో డెల్‌వర్క్ స్టేషన్, ఐవోటీ కిట్, సర్వర్ రాక్, త్రీడీ ప్రింటర్, కార్ లిఫ్ట్, సిల్, ఫెయింట్ బాత్, ఇండస్ట్రియల్ రోబోటెక్, కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ సిస్టమ్(సీఎన్‌సీ), వీఎంసీ, ప్లంబింగ్ పరికరాలు బిగించారు. టాటా టిగోర్, టాటా ఏసీ, ఈవీ కిట్, మహేంద్ర త్రీవీలర్ ఇంకా రావాల్సింది.

వచ్చే ఏడాది ప్రవేశాలకు అవకాశం



ఏటీసీల్లో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరగనున్నాయి. 70శాతం యంత్రాలు అమర్చాం. శిక్షణ పొందిన విద్యార్థులను కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయి. ఉద్యోగాలు, స్వయం ఉపాధికి ఏటీసీలు దోహదపడనున్నాయి. 8వ తరగతి పాస్, 10వ తరగతి ఫెయిలైన వారు షార్ట్‌టర్మ్ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చు.

– రమేష్, ప్రిన్సిపాల్, ఐటీఐ, మంచిర్యాల

కోర్సులకు ఆదరణ

ఐటీఐ కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో 432 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎలక్ట్రీషియన్ 100, ఫిట్టర్ 100, టర్నర్ 40, ఎలక్ట్రానిక్ మెకానిక్ 24, మెకానిక్ 24, వెల్డర్ 40, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా) 24, సోలార్ టెక్నీషియన్ 40, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సులో 40 సీట్లు ఉన్నాయి. ఇందులో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్ కోర్సులకు డిమాండ్ ఉంది. ఆరు కోర్సులతోపాటు మూడు నెలల షార్ట్‌టర్మ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. టూవీలర్ మెకానిక్, పెయిటింగ్, డెంటింగ్, లేజర్ కటింగ్(నాన్‌మెటల్), మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వాటిల్లో తర్ఫీదు ఇస్తారు. శిక్షణ వల్ల ఉద్యోగం, స్వయం ఉపాధి పెరగనుంది.

కొత్త కోర్సులు ఇవే

కోర్సులు	సీట్లు	కాలవ్యవధి
మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	40	ఏడాది
ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిట్ మ్యానుఫ్యాక్చరింగ్	40	ఏడాది
ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్	20	ఏడాది
బేసిక్‌డిజైనర్, వర్చువల్ వెరిఫయిర్	24	రెండేళ్లు
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్	24	రెండేళ్లు
మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్	24	రెండేళ్లు

శేష జీవితం ఆనందంగా గడపాలి



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో సీపీ

మంచిర్యాలక్రైం: పోలీస్ శాఖలో ఇంతకాలం విధులు నిర్వర్తించి విరమణ పొందుతున్న పోలీస్ అధికారులు శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. శుక్రవారం రామగుండం కమిషనరేట్‌లో పదవీ విరమణ ఎస్సై సీహెచ్.చక్రపాణి, ఏఎస్సైలు రవీందర్‌రావు, జీ.రవీందర్‌కుమార్, ఏఆర్ ఎస్సైలు కే.రాజయ్య, అహ్మద్ అలీబేగ్, హెడ్ కానిస్టేబుల్ ఏ.రమేష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐ దామోదర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బొర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చైర్మన్ బలరాంకు నాయకుల వినతిపత్రం

జైపూర్: ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, రూ.5వేలు అలవెన్స్ చెల్లించాలని బీఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి చైర్మన్ ఎన్.బలరాంను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇంచార్జి, జాతీయ సేఫ్టీ కమిటీ సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య వినతిపత్రం అందజేశారు. గత ఏడాది డిసెంబర్‌లో డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషన్ అధ్యక్షతన జరిగిన ఒప్పందం అమలు చేయాలని, కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. బీఎంఎస్ ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ దుస్స భాస్కర్, బీఎంఎస్ నాయకులు పులి రాజిరెడ్డి, మండ రమాకాంత్, శ్రీధర్, పెద్దిరెడ్డి కిషన్‌రెడ్డి, శివకృష్ణ, చిలకాని వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోత లేకుండా శస్త్రచికిత్స

ఆదిలాబాద్‌టౌన్‌: కిడ్నీ స్టోన్‌తో బాధపడుతున్న వృద్ధురాలు (90)కి ఎలాంటి కోతలు లేకుండా అత్యాధునిక టెక్నాలజీతో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించినట్లు రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌ తెలిపారు. జైనథ్‌ మండల కేంద్రానికి చెందిన పింటుబాయి అనే 90ఏళ్ల వృద్ధురాలు రిమ్స్‌ యూరాలజీ విభాగంలో మంగళవారం అడ్మిట్‌ అయ్యారు. డాక్టర్‌ కార్తీక్‌ ఆధ్వర్యంలో అనస్తీషియా వైద్యురాలు హిమనీ రోగి శరీరంపై ఎలాంటి కోతలు లేకుండా లేజర్‌ టెక్నాలజీని ఉపయోగించి స్టోన్స్‌ను తొలగించినట్లు పేర్కొన్నారు. దీంతో పలువురు వైద్యులు, సిబ్బంది, సూపర్‌స్పెషాలిటీ పర్యవేక్షకుడు డాక్టర్‌ సత్యనారాయణలను అభినందించారు. అలాగే వైద్యరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యులను అభినందించారు.

యోగా పోటీల రిఫరీగా వినోద్‌

జన్నారం: జాతీయస్థాయి యోగా రిఫరీ డిప్లొమా పోటీలలో పరీక్ష రాసి, ఉత్తీర్ణత సాధించి యోగా రిఫరీగా జన్నారం మండలం మహ్మదబాద్‌కు చెందిన దుర్గం వినోద్‌ ఎంపికయ్యాడు. ఈనెల 23న నిర్వహించిన ఆన్‌లైన్‌ యోగా పరీక్ష రాసి ప్రతిభ కనబరిచినట్లు తెలంగాణ యోగా అసోసియేషన్‌ కార్యదర్శి సిద్దారెడ్డి, మాజీ కార్యదర్శి మనోహర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా యోగా ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా చైర్మన్‌ అశోక్‌ అగర్వాల్‌ చేతుల ఉత్తీర్ణత పత్రం అందుకున్నాడు.

సెలవు దినాల్లోనూ సేవా కేంద్రాలు

ఆదిలాబాద్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని బీఎస్‌ఎన్‌ఎల్‌ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 30, 31న వినియోగదారుల సేవా కేంద్రాలను తెరిచి ఉంచనున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్‌ నిజామాబాద్‌ అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజులు అయినప్పటికీ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని ఆదిలాబాద్‌, కొమరం భీమ్‌ ఆసిఫాబాద్‌, మంచిర్యాల, నిర్మల్‌ జిల్లా వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

పశువుల వాహనం పట్టివేత

పెంచికల్‌పేట్‌: అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని, పశువులను స్వాధీనం చేసుకున్నట్లు పెంచికల్‌పేట్‌ ఎస్సై కొమురయ్య శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్‌ మండలంలోని మర్థిడి గ్రామం నుంచి హుస్నాబాద్‌కు పశువులను తరలిస్తున్నారనే సమాచారంతో ఎల్కపల్లి పెట్రోల్‌ బంక్‌ వద్ద ఉదయం 5 గంటలకు తనిఖీలు నిర్వహించాం. బొలెరో వాహనంలో తరలిస్తున్న 5 ఎద్దులు, రెండు దున్నపోతులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కరీంనగర్‌కు చెందిన జాఫర్‌, మహ్మద్‌ రఫీ, కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి తాగిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్‌: గంజాయి తాగిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపా రు. ఆదిలాబాద్‌ పట్టణంలోని నీలానగర్‌కు చెందిన బాయసాహెబ్‌ అనే వ్యక్తి గంజాయికి అలవాటు పడినట్లు పేర్కొన్నారు. మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న సమయంలో గంజాయి తాగి ఉండగా.. బాలాజీనగర్‌ ప్రాంతంలో పట్టుకొని తనిఖీ చేయగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు. అతని వద్ద 4 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు వివరించారు.

గ్రామాల్లో సౌర వెలుగులు..!

- ‘పీఎం సూర్యఘర్‌ మస్త్‌ బిజిలీ యోజన’కింద ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో రెండు మోడల్‌ గ్రామాలు
- పూర్తయిన సర్వే


వెంకట్రావ్‌పేటలో సర్వే చేస్తున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్‌: గ్రామీణ ప్రాంత ప్రజలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ అందించడం లక్ష్యంగా సోలార్‌ విద్యుత్‌ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ‘సూర్యఘర్‌ మస్త్‌ బిజిలీ యోజన’ పథకం కింద సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతీ జిల్లాలో ఒక గ్రామాన్ని మోడల్‌ తీర్చిదిద్దనున్నారు. దీంతో ఆ గ్రామాల్లో సోలార్‌ వెలుగులు విరజిమ్మనున్నాయి. ఆదిలాబాద్‌ జిల్లా ఉట్నూర్‌ మండలం నర్సపూర్‌, మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌ మండలం వెంకట్రావ్‌పేట్‌ను మోడల్‌ గ్రామాలుగా ఎంపిక చేశారు. కాగా ఆ గ్రామాల్లో ఎన్‌పీడీసీఎల్‌ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేశారు. ఎన్ని ఇండ్లు, విద్యుత్‌ సర్వీస్‌ మీటర్లు, వ్యవసాయ కనెక్షన్లు, తదితర వివరాలపై సర్వే చేపట్టారు. ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించి, తదుపరి ఆదేశాలు రాగానే పనులు ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ చెబుతున్నారు.

సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా..

కేంద్ర ప్రభుత్వం, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ద్వారా, రాష్ట్రంలో రెడ్‌కో విద్యుత్‌ పంపిణీ సంస్థలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ప్రతీ జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సంపూర్ణ సౌర విద్యుత్‌ గ్రామంగా తీర్చిదిద్దనున్నారు. సౌరశక్తి గ్రామంగా తీర్చిదిద్దేందుకు కేంద్రప్రభుత్వం రూ. కోటి సాయం అందిస్తుంది. స్థానిక ఉత్పత్తి చేయడం విద్యుత్‌ ఖర్చులు తగ్గనున్నాయి.

ఇంటి యజమానికి ఆదాయం..

రూఫ్‌ లెవల్‌ బిల్డింగ్‌పై కిలోవాట్‌ సోలార్‌ ఏర్పాటుకు 80 నుంచి 90 స్క్వేర్‌ ఫీట్లు, 2 కిలోవాట్స్‌ సోలార్‌ ప్లాట్‌ ఏర్పాటుకు 160 నుంచి 190 స్క్వేర్‌ ఫీట్లు, 3 కిలోవాట్స్‌ సోలార్‌ ప్లాంట్‌ ఏర్పాటుకు 270 స్క్వేర్‌ ఫీట్ల స్థలం అవసరం ఉంటుంది. వ్యవసాయ బోరుబావుల వద్ద 7.5 కిలోవాట్స్‌ ప్లాంట్‌ ఏర్పాటుకు బోరుబావుల నుంచి 100 మీటర్ల డీయషన్‌ పరిధిలో సరైన ప్రదేశం అవసరం ఉంటుంది. 2 కిలోవాట్స్‌ ప్లాంటు ఏర్పాటు అయితే ఇంటి యజమానికి నెలకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల ఆదాయం వరకు, బోరు బావుల వద్ద 7.5 కిలోవాట్స్‌ ప్లాంటుకు రూ. 5 వేల నుంచి రూ 6 వేల వరకు ఆదాయం యజమానికి చేరుతుంది. దీంతో పాటు రైతు గృహ అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకునే అవకాశం ఉంది.

ఎంపిక చేసిన గ్రామాల వివరాలు..

గ్రామం	విద్యుత్‌ కనెక్షన్లు	రిజిస్ట్రేషన్‌	వ్యవసాయ కనెక్షన్లు	రిజిస్ట్రేషన్‌
వెంకట్రావుపేట	1415	1405	346	340
నర్సపూర్‌	131	128	76	75

ఉమ్మడి జిల్లాలో రెండు గ్రామాలు..

సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం, సమాజం తమ ఇంధన అవసరాలకు తీర్చుకోవడంలో స్వావలంబన పొందేలా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మోడల్‌ సోలార్‌ విలేజ్‌ అనే పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం అమలుకు రాష్ట్రంలోని 17 జిల్లాలలో 8 గ్రామాలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్‌ జిల్లాలో ఉట్నూర్‌ డివిజన్‌ పరిధిలో నర్సపూర్‌, మంచిర్యాల జిల్లా పరిధిలో లక్షెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట్‌ గ్రామాలను ఎంపిక చేశారు. నర్సపూర్‌లో 131 విద్యుత్‌ మీటర్లుకు 128ఇండ్లను అర్హతగా గుర్తించారు. వ్యవసాయ బోర్లు 75 నమోదు పూర్తి చేశారు. వెంకట్రావ్‌పేటలో 1415 విద్యుత్‌ మీటర్లకు 1405, 346 వ్యవసాయ బోరుబావుల కనెక్షన్లకు 340 నమోదు చేశారు. మొత్తం 1746 కనెక్షన్‌లు నమోదు చేశారు. ఇంటి యజమాని పేరు, బ్యాంకు ఖాతా నెంబర్‌, ఆధార్‌ నెంబర్‌, రూఫ్‌ లెవల్‌లో ఉన్న స్థలం వివరాలను సేకరించారు. ఎంత సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ ఏర్పాటు చేయాలో వివరాలు సేకరించారు. ఆ వివరాలను సూర్యఘర్‌ పోర్టల్‌లో నమోదు చేశారు.

సర్వే పూర్తి చేశాం..



ప్రధాన మంత్రి సూర్యఘర్‌ మస్త్‌ బిజిలీ యోజన పథకం ద్వారా సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. మోడల్‌ గ్రామాల్లో సోలార్‌ విద్యుత్‌ ప్లాంట్లను ఏర్పాటుకు చేసేందుకు సర్వే చేశాం. ఏడీఈ, ఏఈ, సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటి వివరాలు, యాజమాని పేరు, ఆధార్‌కార్డు వివరాలు సేకరించారు. రైతులకు సోలార్‌ ప్లాంట్‌ ప్రయోజనాలను వివరించాం.

– గంగాధర్‌, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, మంచిర్యాల

‘కడెం’ను సందర్శించిన డ్యాం సేఫ్టీ బృందం


ప్రాజెక్టును పరిశీలిస్తున్న డ్యాం సేఫ్టీ బృందం

కడెం: కడెం ప్రాజెక్టును శుక్రవారం ‘స్టేట్‌ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్‌’ బృందం సభ్యులు రిటైర్డ్‌ సీఈ, ఐడ్రో మెకానికల్‌ ఎక్స్‌పర్ట్‌ కె.సత్యనారాయణ, స్టేట్‌ డ్యాం సేఫ్టీ చీఫ్‌ ఇంజినీర్‌ ప్రమీల సందర్శించారు. ప్రాజెక్ట్‌ వరద గేట్లు, కౌంటర్‌ వెయిట్‌లు, లిఫ్టింగ్‌ రోప్‌లను పరిశీలించారు. వరద గేట్ల ఆపరేటింగ్‌ సమస్యలు, ప్రాజెక్ట్‌ స్థితిగతులను ఎస్‌ఈ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు చేశారు. ఇందులో ఈఈ విఠల్‌ రాథోడ్‌, డీఈ నవీన్‌, విజయలక్ష్మి, గణేశ్‌, ఇరిగేషన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

సీల్ట్‌ ఏజెన్సీ బృందం సందర్శన

నీటిపారుదల శాఖ కడెం ప్రాజెక్ట్‌ పూడికతీత టెండర్ల ప్రక్రియను ఈనెల 27న, పూర్తి చేసి, పనులను ఏజెన్సీకి అప్పగించారు. శుక్రవారం ఏజెన్సీ సిబ్బంది కడెం ప్రాజెక్టును సందర్శించి ఇరిగేషన్‌ అధికారులతో మాట్లాడారు. ఏజెన్సీ పేరు, వివరాలు కరీంనగర్‌ సీఈ పరిధిలో ఉంటాయని, టెండర్‌ గురించి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఎస్‌ఈ రవీందర్‌ తెలిపారు.

సరిహద్దు ప్రాంతంలో విస్తృత తనిఖీలు


జాగిలంతో తనిఖీలు చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నార్కోటిక్‌ జాగిలంతో ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా తెలంగాణలోకి వచ్చిపోయే వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ ముమ్మరం చేయడంతో పాటు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి సేవించిన, రవాణ చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో చెన్నూర్‌ రూరల్‌ సీఐ సుధాకర్‌, ఎస్సై రాజేందర్‌, ఎక్సైజ్‌ అధికారులు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

నీలుగాయిని హతమార్చిన వేటగాళ్ల అరెస్టు

- నిందితుల్లో ఒకరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు


అధికారుల అదుపులో వేటగాళ్లు

పెంచికల్‌పేట్‌: మండలంలోని లోడుపల్లి అటవీ ప్రాంతంలో నీలుగాయిని హతమార్చిన వేటగాళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పెంచికల్‌పేట్‌ రేంజ్‌ అధికారి అనిల్‌ కుమార్‌ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లోడుపల్లి అటవీ ప్రాంతంలోని సహజ నీటి వనరుల వద్ద నీలుగాయిని హతమార్చారనే పక్కా సమాచారంతో రావడంతో సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించాం. కొండపల్లి గ్రామానికి చెందిన చప్పిడే వెంకటేశ్‌, ఎల్లూర్‌ గ్రామానికి చెందిన దుర్గం రవీందర్‌ల ఇళ్లల్లో తనిఖీలు చేయగా.. నీలుగాయి మాంసం లభ్యమైంది. వారిని విచారించగా కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం రవి, గొర్లపల్లి మొండి, మన్నెపల్లి శ్రీహరి, ఆత్రం భీమయ్యలతో కలిసి నీలుగాయిని హతమార్చినట్లు ఒప్పుకున్నారు. వెంకటేశ్‌, దుర్గం రవీందర్‌ను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌ విధించినట్లు పేర్కొన్నారు. దుర్గం రవీందర్‌ పెంచికల్‌పేట్‌ మండలంలోని మెరెగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పరారీలో ఉన్న మిగతా నలుగురిని పట్టుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్‌ఎస్‌వో శంకర్‌, ఎఫ్‌బీవోలు సంగదీప్‌, సతీష్‌, లచ్చన్న, మనోహర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి హత్యకు సుపారీ

ఇచ్చోడ: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన భూతగాదాల్లో రాజేందర్‌ అనే వ్యక్తిని చంపేందుకు సుపారీ తీసుకున్న షేక్‌ సోహెల్‌ను శుక్రవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్‌ మండలంలోని గిర్నూర్‌ గ్రామానికి చెందిన గొల్లెన రాజేందర్‌, మేకల దేవేందర్‌ మధ్యలో గత కొద్ది రోజులుగా భూమి వివాదం నడుస్తోంది. అయితే మేకల దేవేందర్‌ ఈనెల 16న ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన షేక్‌ సోహెల్‌ను కలిసి గొల్లెన రాజేందర్‌ను హత్య చేసేందుకు రూ. 3 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. అయితే ఈనెల 26న షేక్‌ సోహెల్‌ రాజేందర్‌ను ఇచ్చోడ మండల కేంద్రంలో కలిసి నిన్ను హత్య చేసేందుకు దేవేందర్‌ సుపారీ ఇచ్చాడని, నువ్వు డబ్బులు ఇస్తే హత్య చేయకుండా వదిలేస్తానని బెదిరించాడు. భయాందోళన చెందిన రాజేందర్‌ సోహెల్‌కు ఫోన్‌ పే ద్వారా రూ. 2 వేలు చెల్లించాడు. మరింత డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు షేక్‌ సోహెల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుళ్లిన మాంసం.. కాలం చెల్లిన స్వీట్లు

- బల్దియా అధికారుల తనిఖీల్లో గుర్తింపు


స్వీట్లను పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్‌: ఆదిలాబాద్‌ బల్దియా పారిశుద్ధ్య విభాగం అధికారులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు హోటల్స్‌, స్వీట్‌ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. కలెక్టర్‌చౌక్‌లోని ఓ హోటల్‌ను తనిఖీ చేసిన అధికారులు కుళ్లిన 6 కిలోల మాంసం, గడ్డ కట్టిన పాడైన చేపలను గుర్తించారు. వాటిని నిల్వ ఉంచిన ఫ్రీజ్‌లో పురుగులు ఉండటంతో హోటల్‌ యాజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిన మాంసతో పాటు ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. హోటల్‌ నిర్వాహకుడిని హెచ్చరించి, జరిమానా విధించారు. అనంతరం వినాయక్‌ చౌక్‌లోని వెంకటేశ్వర స్వీట్‌షాపు, స్వీట్ల తయారీ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. కాలం చెల్లిన స్వీట్లను తయారు చేసిన స్వీట్లతో కలిపి విక్రయిస్తున్నట్లు గుర్తించి, జరిమానా విధించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్లు ఎం.నరేందర్‌, బైరి శంకర్‌లు హెచ్చరించారు.

మందుబాబుల వీరంగం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి బార్‌లో గురువారం రాత్రి రెండువర్గాలు దాడి చేసుకున్న ఘటన సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. సీసీసీ నస్పూర్‌ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన దెబ్బటి శ్రీనివాస్‌ తన స్నేహితులు మల్లేష్‌, అశోక్‌లు కలిసి ఏలైట్‌ బార్‌లో మద్యం తాగుతున్నారు. అక్కడే మరో ముగ్గురు బాడిసే రమేశ్‌, అయితే మహేశ్‌, ప్రశాంత్‌లు తాగుతున్నారు. రమేశ్‌, శ్రీనివాస్‌ స్నేహితులు కావడంతో వారు మాట్లాడుతుండగా.. మహేశ్‌ అనే వ్యక్తి వచ్చి రమేశ్‌ను నిల్చోబెట్టి మాట్లాడుతావ అంటూ.. శ్రీనివాస్‌తో గొడవకు దిగాడు. శ్రీనివాస్‌ తన తమ్ముడు శ్రీకాంత్‌కు ఫోన్‌ చేయడంతో అతను వచ్చి మహేశ్‌ను మందలించాడు. దీంతో శ్రీకాంత్‌పై మహేశ్‌, ప్రశాంత్‌ బీరు బాటిల్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయమై సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా దెబ్బటి శ్రీనివాస్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేశ్‌, ప్రశాంత్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక అక్రమ రవాణపై కొరడా


సీజ్‌ చేసిన ట్రాక్టర్లు

జన్నారం: ఇసుక అక్రమ రవాణ చేస్తున్న వారిపై అటవీశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. టైగర్‌జోన్‌ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌ చేశారు. ఇందన్‌పల్లి రేంజ్‌ అధికారి కారం శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రేంజ్‌ పరిధిలోని బుట్టాపూర్‌ వాగులో నుంచి ఇసుక తోడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. బుట్టపూర్‌కు చెందిన తిప్పని విశ్వాస్‌, జన్నారంకు చెందిన దాసిరి అన్వేష్‌, కలమడుగుకు చెందిన పిండి ముజ్జన్నలకు చెందిన ట్రాక్టర్లను సీజ్‌ చేసి రేంజ్‌ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. అదే విధంగా మొర్రిగూడ ప్రాంతంలో తనిఖీ చేయగా మరో ట్రాక్టర్‌ ఇసుకతో వస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇసుక తవ్వడం, తరలించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరు కార్మికులకు గాయాలు

నస్పూర్‌: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్‌ ఏరియా జీఎం కార్యాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సింగరేణి కార్మికులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్కే న్యూ టెక్‌ గనిలో విధులు నిర్వహిస్తున్న సీసీసీలో నివాసం ఉండే గట్టురాజు, బెల్లంపల్లిలో నివాసం ఉండే చీకటి జనార్దన్‌ శుక్రవారం విధులు ముగించుకుని బైక్‌పై శ్రీరాంపూర్‌ వైపు వెళ్తుండగా.. శ్రీరాంపూర్‌ జీఎం కార్యాలయం సమీపంలో వ్యాను ఢీకొట్టింది. ప్రమాదంలో కార్మికులు ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ఆన్‌లైన్‌ ప్రవేశాలు జరిగేనా..?

- ఇంటర్‌ విద్యలో అమలుపై స్పష్టత కరువు
- మాన్యువల్‌గానే ప్రవేశాలు
- విద్యార్థులపై ప్రైవేట్‌ యాజమాన్యాల ఒత్తిడి


బోథ్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల

బోథ్‌: డిగ్రీలో అమలు చేస్తున్న దోస్త్‌ విధానం తరహాలోనే ఇంటర్‌ ప్రవేశాలపై పీటముడి నెలకొంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం వచ్చినా.. మాన్యువల్‌ గానే ప్రవేశాలు పొందుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాలు తమ కళాశాలల్లో చేరాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల్లో అయోమయం నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రైవేట్‌, ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల విద్యార్థుల ప్రవేశాలపై స్పష్టత కరువైంది.

ప్రైవేట్‌ కళాశాలల ఆగడాలను చెక్‌..

ఇంటర్‌ ప్రవేశాల్లో దోస్త్‌ తరహా ఆన్‌లైన్‌ విధానం అమలైతే విద్యార్థులకు మేలు జరుగుతుంది. విద్యార్థి తనకు నచ్చిన కళాశాలలను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకునే వీలుంటుంది. పదో తరగతిలో విద్యార్థికి వచ్చిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా కేటాయింపులు జరుగుతాయి. ఈ విధానంతో విద్యార్థి తనకు నచ్చిన కళాశాలలో చదివే వీలు ఉంటుంది. వివిధ ఫేజ్‌లతో కూడిన ప్రవేశాలు ఉంటే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉండదు. ఇంటర్‌లో కూడా డిగ్రీ మాదిరిగానే ఆన్‌లైన్‌ ప్రవేశాలు చేపడితే ప్రైవేట్‌ కళాశాలల ఆగడాలను చెక్‌ పడనుంది.

విద్యార్థుల వద్దకు పీఆర్‌వోలు..

పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ఈక్రమంలో ప్రైవేట్‌ యాజమాన్యం క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఇప్పటికే ఎండను సైతం లెక్క చేయకుండా ప్రతీ గ్రామాన్ని సందర్శిస్తున్నారు. తల్లిదండ్రులను కలిసి తమ కళాశాలల్లో చేరాలని కోరుతున్నారు. విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. కాగా ఆయా కార్పొరేట్‌ కళాశాలలకు చెందిన పీఆర్‌వోలు విద్యార్థులతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

కళాశాలల వివరాలు (ప్రభుత్వ, ప్రైవేట్‌)

ఆదిలాబాద్‌	76
నిర్మల్‌	63
మంచిర్యాల	62
కుమురం భీం ఆసిఫాబాద్‌	48

మొదట చేరి.. తరువాత తిరిగి వచ్చి..

పదో తరగతి పరీక్షలను విద్యార్థులు రాయకముందే పలు ప్రైవేట్‌ కళాశాలలకు చెందిన పీఆర్‌వోలు విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులను కలిసి తమ కళాశాల గురించి వివరించి అడ్మిషన్లు చేస్తున్నారు. అడ్మిషన్ల సమయంలోనే వేలల్లోనే ఫీజులు కట్టించుకుంటున్నారు. ఇక పదో తరగతి పాస్‌ కాగానే విద్యార్థి కనీసం నెల రోజులు కూడా కళాశాలలో ఉండకుండా ఇంటికి వచ్చేస్తున్నారు. తాము కట్టిన ఫీజు వాపసు ఇవ్వకుండా కళాశాలల యాజమన్యాలు తల్లిదండ్రులను తిప్పించుకుంటున్నాయి. దీంతో తల్లిదండ్రులు నష్టపోతున్నారు. డిగ్రీ మాదిరిగా ఇంటర్‌లో ఆన్‌లైన్‌ ప్రవేశాలు చేపడితే ఇలాంటి నష్టాలు జరిగే అవకాశం ఉండదు. చెల్లించే ఫీజు వివరాలు కూడా ఆన్‌లైన్‌ అడ్మిషన్‌లో కనిపిస్తాయి. దీంతో ఎక్కువ ఫీజును కట్టే అవకాశం కూడా ఉండదు.

ఆన్‌లైన్‌ ద్వారా చేపట్టాలి



ఇంటర్‌ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలి. డిగ్రీ మాదిరిగా ప్రవేశాలు నిర్వహిస్తే విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. కార్పొరేట్‌ కళాశాలలకు చెందిన పీఆర్‌ఓలు గ్రామాల్లోకి వచ్చి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. దీంతో విద్యార్థుల నుండి అధిక ఫీజులు అడ్మిషన్ల సమయంలో వసూలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఆన్‌లైన్‌లో ప్రవేశాలు జరిపితే విద్యార్థి మంచి కళాశాలలో చదివే అవకాశం ఉంటుంది.

– బోయిడి ఆకాష్‌, ఏబీవీపీ నాయకుడు


ఎలాంటి నోటిఫికేషన్‌ రాలేదు

గతంలో ఇంటర్‌లో ఆన్‌లైన్‌లో ప్రవేశాల కోసం విద్యార్థి కళాశాలకు దరఖాస్తు చేసుకునే వీలుంది. విద్యార్థి కళాశాలలో అడ్మిషన్‌ తీసుకోవాలంటే కళాశాల లాగిన్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. లేదా విద్యార్థి తాను స్వయంగా ఆన్‌లైన్‌ ద్వారా వివరాలను నమోదు చేసుకుని కళాశాలలో చేరే అవకాశం ఉంది. కాని డిగ్రీ తరహా దోస్త్‌ మాదిరి ఆన్‌లైన్‌ ప్రవేశాలు ఇంటర్‌లో లేవు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటిఫికేషన్‌, సమాచారం లేదు.

– గణేశ్‌, జిల్లా ఇంటర్మీడియట్‌ అధికారి, ఆదిలాబాద్‌

రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తాం

- డీఎస్పీ జీవన్‌రెడ్డి
- వ్యక్తిపై దాడి చేసి కిడ్నాప్‌
- 9 మందిపై కేసు.. ఆరుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్‌: ఆదిలాబాద్‌ సబ్‌ డివిజనల్‌ పరిధిలో రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని ఆదిలాబాద్‌ డీఎస్పీ ఎల్‌. జీవన్‌రెడ్డి అన్నారు. రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 8న ఆదిలాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బంగారుగూడకు చెందిన సయ్యద్‌ జాహిర్‌పై పలువురు దాడి చేసి, కిడ్నాప్‌ చేయడం జరిగిందన్నారు. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో భయపడి ఎవరికీ చెప్పలేదు. ఈనెల 26న ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విచారణ చేపట్టగా షేక్‌ ఇజాజ్‌, షేక్‌ సలీంతో పాటు మరో ఏడుగురు ఇంటిలో బంధించి కొటి, సోషల్‌ మీడియాలో పోస్ట్‌ పెట్టారు. ఈ వీడియోల ఆధారంగా వారిపై కేసులు నమోదు చేశామన్నారు. దాడి చేసిన బంగారుగూడకు చెందిన షేక్‌ ఇజాజ్‌, షేక్‌ రోషన్‌, షేక్‌ ముజీబ్‌, ఖానాపూర్‌కు చెందిన హసీబుల్లా, సయ్యద్‌ జుబేర్‌, మహాలక్ష్మివాడకు చెందిన అమర్‌, షేక్‌ సోహెల్‌లను అరెస్టు చేయగా.. రాహేల్‌, షేక్‌ సలీంలు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి మూడు ఆటోలు, మూడు సెల్‌ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్నవారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో సీఐ ఫణిధర్‌, ఎస్సై ముజాహిద్‌, సిబ్బంది పాల్గొన్నారు.